
# కామ్రేడ్ రాంపండు



"హల్లో అనంత్ గారా? కులాసానా? ఏమిటి పార్కులో తిరుగుతున్నారు? ఇన్స్పిరేషన్ కోసమా?" పలకరింపు విని తలెత్తిన అనంతం రాంపండు బాబయ్య సింహాద్రిరావుగారిని చూసి తెల్లబోయాడు.

"ఇన్‌స్పిరేషన్ కోసమా!" అన్నాడు అనంతం అయోమయంగా.

"అదేనండీ. మీ రచయితలకు ఎక్కడ ఇన్‌స్పిరేషన్ వస్తుందో తెలియదు కదా! ప్లాటు కోసం వెతుకుతూ అలా పార్కులు, తోటలు, గుట్టలు తిరుగుతారు కాబోలు..." అన్నాడాయన నవ్వుతూ.

అనంతానికి బల్బు వెలిగింది. రాంపండు పెసరట్ల సుబ్బిని ప్రేమించిన గొడవలో వాళ్ళ బాబయ్య దగ్గరికి తీసుకెళ్ళి ఆయన ఆయన అభిమాన రచయిత కల్పనారాణి తనేనని పరిచయం చేసిన సంగతి గుర్తుకొచ్చింది. అనవసరంగా ఇరుక్కున్నానని అవాళే బాధపడ్డాడు – ముసలాయన ఆ కథ ఎలా రాశారు, ఈ నవల ఎలా రాశారు అని అడిగి చంపుతూంటే! తక్షణం మాట తప్పించకపోతే మాట దక్కదని భయం వేసింది.

"అబ్బే, కథ గురించి అంత పాట్లు పడనండి. ఇంటి దగ్గర కూచున్నప్పుడు అలా ఓ వేవ్ వస్తే రాసి పారేయడమంతే! ఓ సారి రాసేసిన తర్వాత ఆ కథ గురించి ఇక పట్టించుకోను. ఎవరైనా ఏదైనా పాత్ర గురించి అడిగినా ఏమో అనేస్తాను. అంతలా మర్చిపోతానన్నమాట. పార్కుకి సరదాగా వచ్చా! అదిగో ఆ మూల ఆ గడ్డం అబ్బాయి స్పీచి దంచేస్తూంటే తమాషాగా ఉందని వింటున్నాను."

పార్కులో అక్కడక్కడ జనం ఉన్నారు కానీ ఆ ఉపన్యాసం ఇచ్చే మూల మాత్రం జనం బాగానే ఉన్నారు. 'ఎర్ర విప్లవానికి ఎదురు సన్నాహం' వంటి బ్యానర్లు కట్టి ఉన్నాయి. గడ్డం వున్న యువకుడే కాక ఇంకో ఇద్దరు, ముగ్గురు మనుష్యులు మధ్యలో ఉన్నారు. చుట్టూ జనం మంత్రముగ్ధులయి వింటున్నారు. సమాజంలో డబ్బున్నవాళ్ళు బ్రేక్‌ఫాస్టుకి పేదలరక్తం తాగి, పేదల మాంసాన్ని ఫ్రిజ్‌లో దాచుకుని లంచ్‌కి తింటారని ఆ కుర్రాడు గొప్ప నాటకీయంగా కళ్ళతో చూసినట్టు చెబుతున్నాడు. శ్రోతలంతా ఊగిపోతున్నారు.

సింహాద్రిరావుగారు చిరునవ్వు నవ్వాడు. "నేనూ వింటున్నాను, విషయం ఏమయితేనేం, స్పీచ్ మాత్రం అద్భుతంగా ఉంది. మా ఆవిడ షాపింగ్‌కాంప్లెక్స్‌లో దూరింది. 'నీకు బోరు కదా, డాలింగ్, పక్కనే ఉన్న పార్కుకి వెళ్ళి తిరిగొచ్చేయ్' అంది. పార్కులో వాక్ చేస్తూంటే బఠాణీలు చూడగానే నోరూరింది. కొందామని వస్తే, అటు ఆ గడ్డం స్పీకరు, ఇటు మీరూ కనబడ్డారు".

"మీ భార్య అంటే... అప్పుడు వంటచేసే వెంకమ్మగారిని చేసుకుంటానన్నారు... ఆవిడేనా?" అడిగేడు అనంత్ ఆశ్చర్యంగా.

పాపం అనంత్‌కి తెలియదు కానీ ఆవిడ వెంకమ్మనుండి వెంకటేశ్వరిగా మారి చాలారోజులయింది. తన లాభం కోసం సింహాద్రిరావు గారి ఛాందసభావాలు పోగొడదామని రాంపండు కల్పనారాణి నవలలు చదివిస్తే, అవి బాగా తలకెక్కి ఆయన వంటావిడని పెళ్ళాడేసి రాంపండు నోట్లో కరక్కాయ కొట్టాడు. ఇంటావిడగా మారుతూనే వంటావిడ పూర్తి పెత్తనాన్ని తన చేతిలోకి తీసుకుంది. అంతకుముందు జీతం డబ్బు పెట్టి గుర్రప్పందాలు ఆడే అలవాటు వల్ల అబ్బిన అశ్వజ్ఞానాన్ని ఎన్‌కాష్ చేసుకుందామని గుర్రాలు కొనడం మొదలెట్టింది. మొగుణ్ణి దుమ్ముదులిపి, జుట్టుకు రంగేసి, షోకిల్లాగా తయారుచేసింది. తను అంతకంటె మించిన సీతాకోకచిలుకలా తయారయింది. డబ్బు ఇలాటివాటికి ఖర్చవడం వల్ల పాపం రాంపండు పాకెట్‌మనీ దెబ్బతింది. అందువల్ల రాంపండు వాళ్ళ ఇంటికి రాకపోకలు తగ్గించేడు. ఇవన్నీ

సగం, సగం చెప్పి సింహాద్రిరావు గారు వాళ్ళావిడ బ్లాక్ యారో అనే గుర్రాన్ని కొందని కూడా చెప్పాడు.

"మరి మీరేమీ అనటం లేదూ?" అని అడిగేదే కానీ అనంతం నాలిక కరుచుకున్నాడు. లేటు వయస్సులో పెళ్ళాడిన వాణ్ణి అడగవలసిన ప్రశ్న కాదనుకుంటూ.

"అనడం దేనికండి? గుర్రాల వ్యాపారం కదా! పైగా అదేదో మంచి గుర్రమట! చాలామంది దానిమీద పందేలు కాస్తారు కూడానట! డబ్బొచ్చే వ్యాపారం ఏదైతేనేం? పైగా ఖర్చులు కూడా పెరుగుతున్నాయి కదా!" అన్నాడాయన.

'ఖర్చులు పెరుగుతూన్నట్టుగానే ఉంది మిమ్మల్ని చూస్తే. క్రితం సారి చూసినప్పుడు అరడజను ఆడపిల్లల తండ్రిలా ఉన్నవాడివి ఇప్పుడు పూలరంగడిలా ఉన్నావు" అనుకున్నాడు అనంత్. ఆశ్చర్యంగా ఉపన్యాసం ఇచ్చే ఆ గడ్డపు కుర్రాడు అదే మాటంటున్నాడు - అదే సమయానికి! "చూడండి, ఆ ముసలాడికేసి! ఆరుగురు ఆడపిల్లల తండ్రిలా కుక్కిమంచంలో పడివుండవలసినవాడు పూలరంగడిలా పడుచు పెళ్ళాన్నేసుకుని షికార్లు కొడుతున్నాడు" అని అరిచాడు సింహాద్రిరావును చూపిస్తూ.

జనమంతా ఒక్కసారి వెనక్కి తిరిగి చూడడంతో ముసలాయన ఇబ్బందిగా మొహం పెట్టాడు. "నాకూ విప్లవం అంటే ఇష్టమే. ఆ మాటకొస్తే కాలేజీరోజుల్లో నేనూ కమ్యూనిస్టునే. కానీ ఇలా బొత్తిగా పర్సనల్‌గా ఎటాక్ చేయడం మర్యాద కాదంటాను. ఏమంటారు?" అన్నాడు అనంతం సానుభూతి కోరుతూ.

'అబ్బే, మీరంత ఫీలవక్కర్లేదు. పబ్లిక్‌లోకి వస్తే ఏమైనా అంటాం, మా హక్కు అని శ్రీశ్రీ ఎప్పుడో డిక్లేర్ చేసేశాడు. ఇప్పుడు మీరు పబ్లిక్‌ప్లేసులో ఉన్నారు కాబట్టి ఇది తప్పదు. మీ ఇంటికొచ్చి అన్నాడంటే తప్పుపట్టవచ్చు. అయినా మీరింత ఫేమస్ అని నాకు తెలియదు." అన్నాడు అనంతం వెక్కిరింతగా.

"నాకూ తెలియదు. నా గురించి వీడెవడికో బాగా తెలుసేమో!" అంటూండగానే గడ్డంవాడి కంఠం మళ్ళీ మోగింది. "ఆ పూలరంగడితో బాటు నిలబడ్డ పోతుటీగను చూశారా? జీవితంలో ఒక్కరోజు కూడా పనిచేసి ఎరగని ఘటం అది. కష్టజీవులను దోచి తాతముత్తాతలు సంపాదించిన ఆస్తిని అరగదీసి బతుకుతున్న బతుకు వాడిది. ఆంబోతు చేతనైనా పనిచేయించవచ్చేమో కాని వాడి చేత పని చేయించడం దేవుడి... కాదు... కాదు.. అంతరాత్మ తరం కాదు..."

ఈ సారి కులకడం సింహాద్రిరావు వంతయింది. 'ఈ లీడర్లకి మంచి ఆరేటరీ ఉంటుందండి. ఏం చెప్పినా, గొప్ప ఎఫెక్టివ్‌గా చెప్తారు, నాకు ముచ్చట వేస్తుంది. మీ కథల గురించి కూడా ఏమంటాడో..."

అప్పటికే జనాలు వెనక్కి తిరిగి కొరకొరా చూస్తూండడంతో అనంతానికి భయం వేసింది - లాక్కెళ్ళి పార్కులో చిత్తుకాగితాలు ఏరిస్తారేమోనని! "ఫ్రీడం ఆఫ్ స్పీచ్ ఉండాలి గానండి. మరీ ఇంత ఇదిగా ఉండకూడదండి. బైదివే... నాకు కాస్త పని ఉంది. వెళ్తా." అంటూండగానే సింహాద్రిరావు హేళనగా నవ్వాడు. "పనా? అటువంటిది ఏమీ చేయరని వాడంటున్నాడు..." అంటూ.

"ఏమాట కామాట చెప్పుకోవాలి. ఈ పోతుటీగ ఇంకోడి పొట్ట కొట్టదు... కానీ ఆ పూలరంగడున్నాడే... తనను నమ్ముకున్న వారిని నిలువునా ముంచగలడు. నోటి దగ్గర కూడు లాగేయగలడు. వాళ్ళ ప్రేమ వ్యవహారాల్లో నిప్పులూ పోయగలడు... ఇలాటి వాళ్ళు సంఘానికి పట్టిన చీడపురుగులు... వీళ్ళని వదల్చడానికి డిడిటీ చాలదు. విప్లవం ఒక్కటే శరణ్యం..." గడ్డం వాడు మళ్ళీ అష్టోత్తరం అందుకోగానే సింహాద్రిరావు మొహం జేవురించింది. "మా ఆవిడ షాపింగు అయిపోయి ఉంటుంది. వస్తా." అంటూ పరుగు, పరుగున మాయమయిపోయాడు. అనంతం అంతకంటె ముందే పారిపోయాడు.

మర్నాడు క్లబ్బులో అనంతానికి రాంపండు కనబడితే "ఏరా కనబడటం లేదు?" అంటూ పలకరించాడు.


"ఏడిసినట్టుంది. కనబడ్డాను. వినబడ్డాను. నిన్న పార్కులో..."

"పార్కులో మీ బాబయ్య కనబడ్డాడు. నువ్వెక్కడున్నావ్?"

"ఉన్నానులే. ఆ గడ్డం వల్ల గుర్తు పట్టలేకపోయుంటావ్"

"గడ్డమా...?" అనంతం ఆశ్చర్యపోయాడు. "...అంటే ఆ గడ్డం వక్త... హారి నువ్వా? ఓరి స్కౌండ్రల్!"

"చూశావా గడ్డం మహిమ! బాల్య మిత్రుడివి నువ్వు కూడా గుర్తుపట్టలేకపోయావ్! గడ్డం అద్దె డబ్బులు కిట్టినట్టే!"



"నీ కిదేం పోయేకాలంరా! అసలు నువ్వేమిటి? విప్లవం ఏమిటి! అసలు నీలాటి పక్కా బూర్జువా..."

"ఒరే, ఆ భాష నాది. కాపీ కొట్టకు. అసలు సంగతి విను, ముందు ఈ సుందరాంగి ఫోటో చూసి ఎలా ఉందో చెప్పు..." అంటూ జేబులోంచి ఓ ఫోటో లాగేడు.

"చంపావ్! మళ్ళీ ప్రేమలో పడలేదుకదా!"

"మళ్ళీ ఏమిట్రా? ఇదొక్కసారే ప్రేమ! కితంవన్నీ ఒట్టి ఫ్యాన్సీ! పాసింగ్ ఫేజ్! మూర్ఛ వస్తే ఫిట్ అంటారు చూడు, అలాటివన్నమాట. కాస్సేపు ఉంటుంది. మళ్ళీ పోతుంది. కానీ ఈ 'వాలెంతింటా' ఉంది చూశావూ..."

పాపం అనంత్ చూడలేదు. చూసివుంటే పేరులోని 'తింటా' భాగానికి ఆ అమ్మాయి ఎంత న్యాయం చేసిందో కళ్ళారా చూసేవాడు. ఆ పేరుకో కథ ఉంది. వాళ్ళ నాన్న సీతారామయ్య రష్యా వీరాభిమాని. రష్యన్ పేరులా ఉండాలని సీతారామయ్యస్కీ అని మార్చుకోబోయాడు పలకడానికి జనాలు కష్టపడడంతో స్కీతారామయ్య అని మార్చుకుని తృప్తిపడ్డాడు. కూతురు పుట్టినప్పుడు తొలి మహిళా కాస్మోనాట్ వాలెంతినా తెరిష్కోవా పేరుపెట్టాడు. స్కూలులో చేర్పించినప్పుడు టీచరు స్పెల్లింగు కుదరక తెరిష్కోవా కత్తిరించి పారేశాడు. వాలెంతినా పేరు వింతగా ఉండడంతో అటెండెన్స్ రిజిస్టర్‌లు మారుతున్న కొద్దీ పేరు మారిపోయింది. మరో టిఏ వచ్చి చేరడంతో టెన్త్ క్లాసుకు వచ్చేసరికి అది చివరికి వాలెంతింటాగా తేలింది. పేరుగురించి తోటి క్లాసుపిల్లలు ఏడిపిస్తూంటే కోపం వచ్చి తింటా, తింటా అని ఛాలెంజి చేసి మరీ తినేసేది వాలెంతింటా! ఆమె కృషి ఫలితంగా పేరులోనే కాకుండా శరీర సౌష్టవం విషయంలో కూడా రష్యన్ మహిళతో పోలిక వచ్చిచేరింది.

అనంత్ అదే అన్నాడు. "రష్యన్ అమ్మాయిలా వుంది. ఎక్కడ కలిశావ్?" అని.

"మొన్న ఓ ఊరెళ్ళి తిరిగొస్తూ బస్సు దొరక్క లారీ ఎక్కాను. టాప్‌మీద కూచోబెట్టాడు. తింటా కూడా అక్కడే ఉంది. కాస్త దూరం వెళ్ళాక వర్షం వచ్చింది. గొడుగు తీసి దగ్గరకి రమ్మనమని ఆఫర్ చేశాను. సరేనంది. బోల్డు కబుర్లు చెప్పుకున్నాం..."

"ఆమెకి గొడుగు పట్టావంటే నువ్వు బాగా తడిసిపోయివుంటావ్."

"కరెక్టే! బాగానే గెస్ చేశావే! కానీ నాకు చలి తెలియలేదురా. ఒంట్లో ఒకటే వేడి. విప్లవం వచ్చాక తను డబ్బున్నవాళ్లందరినీ కత్తిపెట్టి డొక్కలో ఎలా పొడుస్తుందో తింటా వర్ణిస్తూంటే బలే హుషారుగా ఉందనుకో. అసలు తనకీ, వాళ్ళ నాన్నకీ జరిగే ఆర్గ్యుమెంట్స్ నువ్వు విని తీరాలి. వాళ్ళందరినీ తుపాకీతో కాలుద్దామంటాడు స్కీతారామయ్య. కాదు, కత్తే బెటరంటుంది కూతురు. చివరికి ఇద్దరూ కలిసి నన్ను తేల్చమంటారు..."

"పోయి, పోయి నిన్నడగడమేమిటి? నువ్వు ఫలానా అని తెలియదా?"

"తెలియదు. నేను ఓ పెద్ద విప్లవకారుణ్నని, పోలీసులు గుర్తుపట్టకుండా గడ్డం పెట్టుకుని మారువేషంలో తిరుగుతున్నానని అనుకుంటున్నారు. నువ్వు మీ ఇంటికి టీకి పిలిచినప్పుడు వాళ్ళతో ఈ విషయం అనకురోయ్".

"నేనెక్కడ పిలిచాను?"

'పిలిచావులే. నీకు తెలియదు. నన్ను, వాలెంతింటానీ, వాళ్ళ నాన్ననీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకి పిలిచావు".

"సర్లే. రండి. డబ్బున్నవాళ్ళను తిట్టడం, వాళ్ళ తిండి తినడం".

"విప్లవం తేవాలంటే బాగా తిండి తినాలోయ్, భగవాన్లూ. పైగా మీ ఇంట్లో తింటున్నామంటే శతృధనం దోస్తున్నట్టేగా, అంటే విప్లవంవైపు ఇంకో అడుగు వేస్తున్నామన్నమాట! బై, బై, వస్తా. రేపు కరీంనగర్‌లో మీటింగుంది. స్పీచ్ ప్రిపేర్ చేసుకోవాలి..."

"టీలో ఉప్పు వేయిస్తానులే. నా ఉప్పు తిన్న విశ్వాసంతో ఈసారి స్పీచ్‌లో నన్ను తిట్టకుండా వుంటావ్."

'ఒరే, ఉప్పంటే గుర్తుకువచ్చింది. నేను 'టీ' అనడంతో నువ్వు మిస్‌లీడ్ అయినట్టున్నావ్. టీ అంటే టీ అనే కాదు, అచలపతికి చెప్పి రొయ్యల వేపుడు, చికెన్ బిర్యానీ, సూప్, మటన్... సర్లే నీకు చెప్పినా మర్చిపోతావ్. అచలపతికి నేను డైరక్టుగా చెప్తానులే... కావాలంటే ఓ దాంట్లో ఉప్పు కాస్త ఎక్కువ వేయించు. ముందే చెప్తే అది వదిలేస్తా..."

ఆదివారం మధ్యాహ్నం, అనంతం ఇంట్లో –

అది తింటా, ఇది తింటా అని వాలెంతింటా ముందుగా చెప్పితింటే అదేమీ చెప్పకుండానే స్కీతారామయ్య తిన్నాడు. వాళ్ళిద్దరూ తిన్నదానికి రెట్టింపు లాగించేడు – వాళ్ళతోబాటు వచ్చిన స్కీతారామయ్య అసిస్టెంటు చిన్‌మిన్ (అసలు పేరు చిన్నయ్యట)! అసలు రాంపండు ఎజెండాలో చిన్‌మిన్ లేడు. రాంపండు సీనులోకి రావడానికి ముందు వాలెంతింటా అతనంటే ఇష్టపడేదిట. కానీ ఇప్పుడు పట్టించుకోవడం మానేసింది. అయినా స్కీతారామయ్య పట్టుదల మీద అతన్నీ పిలవాల్సి వచ్చింది.

రాంపండు పరిచయం చేయగానే స్కీతారామయ్య 'కామ్రేడ్ అనంత్" అని పిలవడంతో అనంత్ ఇబ్బందిగా ఫీలయ్యాడు కానీ త్వరలోనే అది మర్చిపోయాడు, దానికి మించిన ఇబ్బందికర పరిస్థితులు ఎదురుకావడంతో. "మా వాడికి ఇంకా విప్లవం గురించి సరిగ్గా అవగాహన లేదు. నేను వాడిని క్రమంగా మారుస్తున్నాను. ఇప్పుడే కామ్రేడ్ అంటే వాడు ఉలిక్కిపడతాడు" అని రాంపండు అంటున్నా స్కీతారామయ్య కామ్రేడ్ అంటూనే అన్నాడు. ఇక బక్కచిక్కిన నక్కలా ఉన్న చిన్‌మిన్ తింటూన్నంతసేపూ "ఈ అన్నం ఎంతమంది పేదల స్వేదంతో ఉడికిందో" అంటూ పద్యాలు పాడాడు. "బొర్ర బాగా పెంచినావులే, బుర్ర పగలకొడతా" అని పాటలు పాడేడు. అక్కడ బొర్ర పెంచినది స్కీతారామయ్యే అయినా అదేమిటో అనంతే ఎక్కువ సిగ్గుపడ్డాడు.

అచలపతి సాధ్యమైనంత వరకూ యజమానిని కాపాడేడు. విప్లవం గురించిన మాట వచ్చినప్పుడల్లా కంచంలో బిర్యానీ వడ్డించేడు. నోటినిండా స్వీట్లు కుక్కాడు. అవన్నీ గబగబా మింగేసి పద్యాలు పాడేడు చిన్‌మిన్. స్కీతారామయ్య కూడా తక్కువ తినలేదు. అచలపతి "సర్" అని అనంతాన్ని పిలుస్తూంటే చిరాకుపడ్డాడు. "కామ్రేడ్ అచలపతీ, విప్లవం రానీ, మనందరం కలసి, వీళ్ళందరినీ తందాం." అని ఓదార్చాడు. ఈ మాటలు అస్సలు పట్టించుకోనివాళ్ళు ఇద్దరే! రాంపండూ, వాలెంతింటా. వాళ్ళిద్దరి వ్యవహారాన్నీ బాగా

పట్టించుకున్నవాడు ఒక్కడే- చిన్‌మిన్! ముఖ్యంగా తింటా రాంపండు వీపుమీద చరిచినప్పుడు, రాంపండు తింటా బుగ్గ గిల్లినప్పుడు ఆ నొప్పి అనుభవించింది అతనే!

అనంతానికి ఈ మూకను భరించడం ఒక ఎత్తు. వాళ్ళందరినీ పంపించి వచ్చాక రాంపండు చెప్పిన న్యూస్ మరో ఎత్తు.

"థాంక్స్‌రా! తింటాకు మీ ఇల్లు బాగా నచ్చింది. విప్లవం వచ్చేదాకా ప్రతీవారం వాళ్ళందరికీ మీ ఇంట్లో భోజనం పెట్టించే షరతు మీద పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుందిరా, వాళ్ళ నాన్న తన మాటకు అడ్డుచెప్పడులే, కాస్త డబ్బు సమకూరితే చాలు. పెళ్ళి చేసేసుకోవడమే! వచ్చే ఆదివారం వంట ఏం చేయించాలో శనివారానికల్లా మెనూ ఇచ్చేస్తానులే..."

రాంపండు వెళ్ళిన అరగంట దాకా అనంతానికి నోరు పెగలలేదు. పెగిలాక 'అచలపతీ! విప్లవం ఎప్పుడు వస్తుందంటావ్?" అని వాకబు చేశాడు.

"పై ఆదివారం లోపున వచ్చే సూచనలు లేవు సర్. ఈ అవస్థ భరించలేక అప్పటికి నేను రాజీనామా చేస్తాను కాబట్టి ఆ తర్వాత ఎప్పుడొచ్చినా నా కొకటే!"

"వీడి పెళ్ళి నా చావుకొచ్చిందయ్యా. వీడికి పెళ్ళి కాకుండా ఏదైనా చేయాల్సిందే!'

ఇది జరిగిన నాలుగు రోజులకి అనంతానికి రోడ్డు మీద సింహాద్రిరావుగారు కనబడ్డారు. పూలరంగడి లక్షణాలు పోయి కట్టెలరంగడి లక్షణాలు కనబడ్డాయి. పక్కనే ఉన్న రాంపండు విశదీకరించాడు. 'ఇవాళే మా బాబాయికి ఓ బెదిరింపు ఉత్తరం వచ్చింది." అని.

సింహాద్రిరావు తలాడించేడు. "అవును. నన్ను చంపేస్తారట. చేతిరాత గుర్తుపట్టకుండా ఎడంచేత్తో రాశారు. మీకు గుర్తుందిగా- ఆవేళ పార్కులో ఓ గడ్డపాడు మనల్ని బెదిరించలేదూ... వాడే అయి వుంటాడు. వాడి ముఖం మీకు గుర్తేగా? పోలీసులు అడిగితే గుర్తుపట్టగలరుగా?'

ఈ లోపునే రాంపండు కలగజేసుకున్నాడు. "అసలేమయిందంటే, నేను పొద్దున్న బాబాయిని పలకరిద్దామని వస్తూంటే ఓ గడ్డం వాడు నాకు ఎదురయ్యేడులే. అప్పుడు తెలియలేదు. ఉత్తరం చూశాక అర్థమయ్యింది. అయినా బాబాయ్, నీకు చెప్తూంటే వినవేంటి? ఈ స్టేజిలో పోలీసులకు చెబితే అనవసరమైన న్యూసెన్స్. నేను వెతుకుతానంటున్నానుగా. నాకు వదిలేయ్. ఇదిగో అనంత్ కూడా వచ్చాడు. కథలు రాస్తాడు కాబట్టి వాడి దగ్గర బోల్డు అయిడియాలుంటాయి. ఆ గడ్డపాణ్ని వెతికి పట్టుకుని నీ కప్పగిస్తా. నువ్వు ఇంటికెళ్ళి రెస్టు తీసుకో".

"అవునవును. అనంత్ గారూ. మీరు నాకు సాయం చేయాలి". అని సింహాద్రిరావు చెబ్తూండగానే రాంపండు ఆయన్ని తరిమేశాడు. ఆ తర్వాత విజయగర్వంతో అనంత్ కేసి చూస్తూ జేబులోంచి ఐదువేల రూపాయల కట్ట లాగాడు. "చూశావా? తైలం! మామూలుగా అడిగితే ఇచ్చాడా? అబ్బే! ప్రాణభీతి కలిగిస్తే డబ్బులు రాల్చాడు. గడ్డపాణ్ని వెతికిపట్టుకోవడానికి ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్. తైలపుబావిని తవ్వినకొద్దీ ఫలం". అన్నాడు విలాసంగా నవ్వుతూ.

'ఆ డబ్బెట్టి ఏం చేస్తావ్? తింటాని పెళ్ళి చేసుకోవడానికి సరిపోతుందా?"

"పెళ్ళికి డబ్బు తక్కువ పడుతుంది. అందుకే "బ్లాక్ యారో" గుర్రం మీద పందెం కాయబోతున్నా. పదిరెట్లు వస్తుంది. నువ్వూ కాయ్! గుర్రం మా బాబయ్యదేలే! మంచి ఫామ్‌లో ఉందిట".

"నేనూ కాద్దామనుకుంటున్నానులే. పెళ్ళంటున్నావు... మీ చిన్‌మిన్‌గాడు అడ్డు పడడూ?"

"ఏడిశాడు. ఇవాళ తింటా నాతో సినిమాకి వస్తోంది. తోకలా వెంటరావద్దని వాడికి వార్నింగు ఇచ్చేసింది తెలుసా".

రేసుకోర్సులో కథ అడ్డం తిరిగింది. బ్లాక్ యారో అన్నిటికంటె చివరిగా... అంటే తరువాతి రేసులో ఫస్టు వచ్చేటంత చివరిగా... చేరింది. అనంత్ కాసిందంతా పోయింది. 'పోయింది చాలు, ఇంటికెళ్ళి పోదామనుకుంటూండగానే' దిగాలు మొహం వేసుకుని సింహాద్రిరావు కనబడ్డాడు. వెళ్ళి ఓదార్చబోతే 'గుర్రాలు కొంటాను కానీ దాని మీద పందాలు కాయడం నా సిద్ధాంతానికి వ్యతిరేకం' అన్నాడు. 'మరి మొహం అలావుందేం' అని అడిగితే "ఆ గడ్డపాడు అక్కడ ఉన్నాడు చూడండి. నన్నేమైనా చేస్తాడేమోని భయం" అన్నాడు.

అవును. రాంపండు గడ్డం పెట్టుకుని స్పీచ్ దంచేస్తున్నాడు. ఉన్నదంతా బ్లాక్ యారో మీద పెట్టి ఊడ్చుకుపోయిన బాధ అతని మాటల్లో తెలుస్తోంది. డబ్బున్నవాళ్ళు ప్రచార సాధనాలను గుప్పిట్లో పెట్టుకుని చచ్చు, పుచ్చు జట్కా గుర్రాలను మేలుజాతి గుర్రాలుగా నమ్మించి శ్రామికజీవుల కష్టార్జితాన్ని దోచుకోవడం గురించి నిప్పులు చెరుగుతున్నాడు. అతనిలాగే డబ్బు పోగొట్టుకున్న వాళ్ళందరూ ఆ నిప్పులకు విసనకర్ర విసురుతున్నారు.

చెలరేగిపోతున్న రాంపండు కంటికి వాళ్ళ బాబయ్య కనబడ్డాడు – "అడుగో, మనందరి చెమటకూడుని తన గిట్టలతో మట్టిపాలు చేసిన బ్లాక్ యారో స్వంతదారు అక్కడే ఉన్నాడు. పదండి. వాడి రక్తంతో మన జండాను తడుపుదాం.' అని అరిచాడు. పక్కనే ఉన్న సీతారామయ్య మెచ్చుకోలుగా తలవూపాడు. చిన్‌మిన్ అసూయతో రగిలిపోయాడు.

జనమంతా తనకేసి చూడడంతో సింహాద్రి ఖంగారుపడి పక్కనే ఉన్న పోలీసు దగ్గరకి వెళ్ళి "ఏమిటండీ, వాడలా అరుస్తూంటే మీరిలా ఊరుకుంటారు?" అని అడిగేడు. పోలీసు చిద్విలాసంగా నవ్వి, "ఇదంతా సోడా గ్యాసులాటిదండి. ఇంకో రేసు మొదలవగానే వీళ్ళంతా ఇవి కట్టిపెట్టి బుకింగ్ దగ్గరకి పరిగెడతారు. మీరేమీ ఇదవకండి". అన్నాడు.

ఈ లోపున చిన్‌మిన్ రాంపండుని పక్కకు తోసి, ఓ బెంచీ ఎక్కి తన ఉపన్యాసం మొదలుపెట్టాడు. ఫ్రెంచి విప్లవంతో మొదలుపెట్టి చెప్పుకువస్తున్నాడు. ప్రస్తుత సమస్య గుర్రాల గురించి అయితే పాతకథ ఎవడికి కావాలి? పైగా రాంపండు స్పీచులో ఉన్న ఫోర్సు చిన్‌మిన్‌కి లేదు. 'ఇక చాల్లేవోయ్, నువ్వు దిగి ఆ గడ్డపాణ్ణి మాట్లాడనియ్యి" అన్నాడొకడు. ఆ మాత్రం మాటలు కూడా చెప్పే ఓపిక లేనివాళ్ళు ఈలలేసారు. చిన్‌మిన్‌కి ఒళ్ళు మండిపోయింది. ఏదో అనబోయి గుటకలు మింగాడు. అంతలోనే అతని చూపు బయటకు నడుస్తున్న సింహాద్రిరావు మీద పడింది. ఏదో ఐడియా అతని తలలో మెరిసింది.

"మహా ప్రజలారా! మీరెంత వెక్కిరించినా మన విప్లవం ముందుకు సాగుతూనే ఉంది. సమాజంలోని ఉన్నత వర్గాలలో కూడా పాకుతోంది. డబ్బున్న వాళ్ళలో కూడా కొంతమంది యువకులు మాతో చేరుతున్నారు. అంతెందుకు, ఆ గుర్రం యజమాని అన్నగారి కొడుకే మనమధ్య ఉన్నాడు". అంటూ రాంపండు తేరుకొనేలోగా అతని గడ్డం లాగేశాడు చిన్‌మిన్.

***

మర్నాడు అనంత్ నిద్రలేచేసరికి పొద్దెక్కింది.

కాఫీ ఇస్తూ 'రాంపండు గారు ఫోన్ చేశారు సర్. పోలీసు స్టేషన్లో ఉన్నాను వెయ్యిరూపాయలు లంచం ఇస్తే వదిలేస్తారట అని అంటే మీరు నిద్ర లేవలేదు కదానని నేనే మీ జేబులోంచి డబ్బు తీసి పంపాను సర్" అన్నాడు అచలపతి.

"మంచి పని చేశావ్. లాకప్‌లో తన్నులు తినివుండడులే. ఓ పక్క వాళ్ళ బాబయ్య, ఇంకో పక్క జనాలు కొట్టిన దెబ్బలకు శరీరంలో ఏ భాగమూ ఖాళీగా మిగిలివుండదు. ఇంకెక్కడ కొడతారు పోలీసులు? అయినా నా కర్థం కాదు – సింహాద్రిరావుకి, రాంపండుకి ఉన్న బంధుత్వం గురించి ఆ చిన్‌మిన్ గాడికి అనుమానం ఎలా వచ్చిందంటావ్? పోలికలు ఉన్నాయంటావా?" అడిగాడు అనంత్.

"ఉండే వుంటాయి సర్. పైగా నేను నోరుజారడం వల్ల కూడా చిన్‌మిన్‌కి అనుమానం వచ్చివుంటుంది".

"వాణ్ని నువ్వెక్కడ కలిశావ్?"

"చేపల బజార్లో! ఆదివారం సంతర్పణ కోసం చేపలు తేవడానికి వెళితే అక్కడ కనబడ్డాడు. తిండిమాట ఏదో వచ్చి, 'రాంపండుకి కూడా వాళ్ళ బాబయ్యపోలికే వచ్చింది. తిండియావ ఎక్కువయ్యి వాళ్ళ బాబయ్య వంటావిణ్ని చేసుకున్నాడు. ఈయన 'తింటా' అనే అమ్మాయిని చేసుకుంటున్నాడు. అన్నాను. అప్పటిదాకా వాళ్ళ పెళ్ళి విషయం చిన్‌మిన్‌కి తెలియదనుకుంటాను. కాస్త ఫీలయ్యాడు. రాంపండు గురించి ఇంకా ఎక్కువ అడిగితే చెప్పలేనన్నాను. అయినా అతను వాకబు చేశాడేమో మరి!"

అనంతం అచలపతికేసి చిరునవ్వుతో చూశాడు. "దేవాంతకుడివయ్యా! ఒక్క దెబ్బతో మనకు ఆదివారాల పీడ వదిల్చేసేవ్. మెచ్చాను పో. జేబులో ఆ వెయ్యా పోగా ఏదైనా మిగిలితే తీసేసుకో". అన్నాడు హుషారుగా.

అచలపతి వినయంగా వంగి, "మీరీమాట అంటారని ముందే ఊహించాను సర్. అందుకే జేబులో ఏమీ మిగల్చలేదు" అన్నాడు.

